క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో తిరుప్పావడ సేవ



తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో నిత్యం శ్రీవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీవారికి తిరుప్పావడ సేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సేవలో భాగంగా శ్రీవారికి 40 కేజీల పులిహోర రాశిగా పోసి తిరుమలేశునికి ప్రీతిపాత్రమైన శ్రీనివాసుని గద్యాన్ని పటిస్తూ నైవేద్యంగా సమర్పించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

25న వాహనాల వేలం



వేలం వేయనున్న వాహనాలు

అక్కిరెడ్డిపాలెం : గాజువాక క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో అనధికారికంగా ఉన్న 7 మోటార్ సైకిళ్లను ఈ నెల 25న వేలం వేయనున్నట్లు సౌత్ సబ్ డివిజన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. గాజువాక తహసీల్దార్ ఉత్తర్వుల మేరకు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు 25న స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

దేవన్‌రెడ్డిని కలిసిన సనపల రవీంద్ర భరత్



తిప్పల దేవన్‌రెడ్డికి చిత్రపటం అందజేస్తున్న రవీంద్రభరత్

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ విశాఖపట్నం జిల్లా బీసీ విభాగం అధ్యక్షునిగా నియమితులైన సనపల రవీంద్ర భరత్ ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, దేవుని చిత్రపటం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొడ్డ గోవింద్, ధర్మాల శ్రీను, రమణారెడ్డి, సాగర్, శివకుమార్, మంగునాయుడు, కుమార్, నాయుడు, గరికిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ



మాట్లాడుతున్న చంద్రశేఖర్

పెదగంట్యాడ: చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి జ్ఞానం అనే జ్యోతిని వెలిగిద్దామని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఐ. చంద్రశేఖర్ అన్నారు. పెదగంట్యాడ మండల పరిధిలోని 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటల ద్వారా అభ్యసనం ఈ శిక్షణ లక్ష్యాల్లో ఒకటన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి నీలవేణి, ఎంఈవో ఇమంది శ్రీనివాస్, నడుపూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ఆర్పీలు మూర్తి, సూరిబాబు, రంజాన్, సుజాత, సీఆర్పీలు పాల్గొన్నారు.

అతిథిగృహం అదరహో..

చుట్టూ పరుచుకున్న పచ్చదనం.. ఎత్తయిన కొండ ప్రాంతం.. ఆ గిరిపై అందమైన భవనం.. అక్కడ బస చేసే అవకాశం వస్తే ప్రకృతి ఒడిలో సేద తీరినట్లే ఉంటుంది. కొండపై నుంచి కనిపించే ప్లాంట్, టౌన్‌షిప్ ఏరియల్‌వ్యూ చూసిన సందర్శకులకు తనివి తీరదంటే అతిశయోక్తి కాదు. ఆ సుందర భవనమే స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్ గెస్ట్ హౌస్. త్రీస్టార్ సదుపాయాలతో ఉన్న ఈ గెస్ట్ హౌస్‌ను సందర్శించిన వారెవరైనా అక్కడి వసతులకు ముగ్ధులు కావాల్సిందే.



హిల్‌టాప్ గెస్ట్‌హౌస్ ఏరియల్ వ్యూ



కింద నుంచి గెస్ట్‌హౌస్

- ఐకానిక్ గెస్ట్‌హౌస్ 'స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్'
- వీవీఐపీలకు విడిది కేంద్రం
- ప్రకృతి అందాల సమాహారం

ఉక్కునగరం: విశాఖ నగరంలోని విడిది కేంద్రాల్లో హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ సర్క్యూట్ హౌస్, గవర్నర్ బంగ్లా, ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లు ఉన్నా హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో విడిది ప్రత్యేకం. అందుకే విశాఖ సందర్శించే వీవీఐపీల వసతికి జిల్లా యంత్రాంగం, అధికారులు ఈ గెస్ట్‌హౌస్‌కే మొదటి ప్రాధాన్యం ఇస్తారు.

మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మాణం

కార్పొరేట్ సంస్థగా స్టీల్‌ప్లాంట్ సందర్శించే ప్రముఖుల వసతి కోసం ప్లాంట్ ప్లాజా గేటుకు సమీపంలోని కొండపై త్రీస్టార్ వసతులతో గెస్ట్‌హౌస్‌ను నిర్మించారు. నాటి సీఎండీ డి.ఆర్.ఆహుజా 1990 ఫిబ్రవరిలో దానిని ప్రారంభించారు. కింద నుంచి సుమారు 1.5 కిలో మీటర్ల దూరంలో ఉన్న గెస్ట్‌హౌస్‌కు వెళ్లే విశాలమైన రహదారిని ఇరుపక్కలా పూల మొక్కలతో తీర్చిదిద్దారు. అతిథుల సౌకర్యార్థం తొమ్మిది రూములతో పాటు నాలుగు ప్రత్యేక సూట్లు ఏర్పాటు చేశారు. స్టార్ హోటల్ స్థాయిలో కిచెన్, రూమ్ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన వంటకాలు చేసే నిపుణులను నియమించడంతో అతిథులకు అక్కడే ఫలహారం, భోజన ఏర్పాట్లు చేస్తుంటారు.



బస చేసిన విశిష్ట అతిథులు

విశాఖ పర్యటనకు విచ్చేసిన మాజీ ప్రధానులు డాక్టర్ మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఉపరాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ ఈ గెస్ట్‌హౌస్‌లోనే బస చేశారు. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, కేంద్ర ఉక్కు మంత్రులు బేణీ ప్రసాద్ వర్మ, రామ్‌విలాస్ పాశ్వాన్, సినీ ప్రముఖులు చిరంజీవి, కమల్‌హాసన్, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, ఇళయరాజా, రాజేంద్రప్రసాద్, రావుగోపాలరావు ఇక్కడ విడిది చేశారు. కేంద్ర ఉక్కుశాఖ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు వంటి ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు సీఐఎస్ఎఫ్ ఐజీ, డీఐజీలు, దేశంలోని పలువురు ప్రముఖులు ఈ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు.

సినిమా షూటింగ్‌లు కూడా.. షూటింగ్ నిమిత్తం విశాఖకు వచ్చిన అనేక మంది హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో షూటింగ్ చేస్తుంటారు. రాజేంద్రప్రసాద్ హీరోగా, రంభ హీరోయిన్‌గా రావుగోపాలరావు ముఖ్యపాత్రలో నటించిన 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా మొత్తం ఇక్కడే షూటింగ్ జరిగింది. అదే విధంగా కమలహాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు విశ్వనాథ్ నటించిన శుభసంకల్పం చిత్రం, నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన సమరసింహారెడ్డి తదితర సినిమాల షూటింగ్‌లు ఈ గెస్ట్‌హౌస్‌లోనే జరిగాయి.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం

గాజువాక : వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ అనుబంధ సంఘాలకు అధ్యక్షులను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇల్లపు శ్రీనివాస్ (యువజన విభాగం), పల్లా చినతల్లి (మహిళా విభాగం), చిత్రాడ వెంకట రమణ (బీసీ సెల్), మార్టుపూడి పరదేశి (ఎస్సీ సెల్), ఎం.డి.నజీర్ (మైనార్టీ సెల్), కొత్తపల్లి నాగరాజు (క్రిస్టియన్ మైనార్టీ సెల్), శెట్టి నిఖిల్‌వర్ధన్ (విద్యార్థి విభాగం), కొయ్య భారతి (మున్సిపల్ విభాగం), మామిడి శ్రీను (వలంటీర్స్ విభాగం), కొల్లిపాక అప్పారావు (నేత విభాగం), బోర వేణుశ్రీ (అంగన్‌వాడీ విభాగం), పిన్నింటి పరమేశ్వరరావు (సోషల్ మీడియా విభాగం), చిప్పుళ్ల వెంకట అప్పారావు (దివ్యాంగుల విభాగం), గుర్రం శ్రీను (పబ్లిసిటీ వింగ్)లను అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్షతగాత్రునికి వైఎస్సార్‌సీపీ నాయకుడి చేయూత



సాయి మహర్షి తండ్రికి రూ.5వేలు అందిస్తున్న బలిరెడ్డి నాగేశ్వరరావు

అగనంపూడి : రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస విరిగి కాళ్లు, చేతులు చచ్చుబడిన విద్యార్థి తలారి సాయి మహర్షికి అగనంపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు రూ.5 వేలు అందించారు. తండ్రి అనారోగ్యంతో రెండేళ్ల నుంచి బాధపడుతూ ఉండడం, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న విషయం సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు ద్వారా తెలుసుకున్న నాగేశ్వరరావు బాధితుని కుటుంబానికి నగదు అందించి భరోసా కల్పించారు. లయన్స్‌క్లబ్ జిల్లా కోఆర్డినేటర్లు గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, పట్టా రామ అప్పారావు, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

యంత్రాలు లేకుండా ఉత్పత్తి పెంపు అసాధ్యం



ఉక్కు పోరాట దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కులో పూర్తి స్థాయి ఉత్పత్తి సాధనకు అవసరమైన పరిస్థితులు కల్పించాలని సీఐటీయూ అధ్యక్షుడు వై.పి.దాస్ డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా అంచనాలు వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ కర్మాగారంలో యంత్ర సామగ్రి లేకుండా ఉత్పత్తి పెంచేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అలా యాజమాన్యం కృషి చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో ఎస్ఎంఎస్ – 2లో జరిగిన ఘోర ప్రమాదమే ఇందుకు ఉదాహరణ అన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడుతూ యాజమాన్యం వైఖరి మార్చుకోవాలని అన్నారు. శిబిరంలో గంగాధర్, భానుమూర్తి, మరిడయ్య, సత్యనారాయణ, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ లేని ప్రయాణికుడికి జరిమానా



టికెట్ తనిఖీలు నిర్వహిస్తున్న టీటీఈలు

అగనంపూడి : దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో ప్లాట్‌ఫామ్ వైపు రైల్వే అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తనిఖీలు చేపట్టారు. రెండు రోజులపాటు నిర్వహించిన తనిఖీల్లో కేవలం ఒకరు మాత్రమే టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించారు. ఇటీవల కాలంలో దువ్వాడలో తనిఖీలు లేకపోయినా, వేలాది మంది ప్రయాణికులు రైలు దిగి వచ్చినా కేవలం ఒకరు మాత్రమే దొరకడం గమనార్హం.

మాజీ సీఎం జగన్‌కు ఘన స్వాగతం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, తదితరులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గురుమూర్తిరెడ్డి, అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం : శ్రీకాకుళం పర్యటనలో భాగంగా విశాఖకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విశాఖ ఎయిర్‌పోర్టులో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్, గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర పాల్గొన్నారు.

గాజువాక : పెందుర్తి మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలుసుకున్నారు. విశాఖ పర్యటనలో భాగంగా ఎయిర్‌పోర్టులో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ముచ్చటించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్ మోహన్‌రెడ్డి సూచించినట్టు గురుమూర్తిరెడ్డి తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యం కొనసాగించాలి



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు, నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ సౌకర్యం యథావిధిగా కొనసాగించాలని ఉక్కు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘం, వివిధ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై గురువారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేశారు. పాత పద్ధతి కొనసాగించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 40 ఏళ్లు కష్టపడి పని చేసిన రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1500 నుంచి రూ. 2500 మాత్రమే పెన్షన్ లభిస్తుందన్నారు. వారికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి ఆదుకోవాల్సిన యాజమాన్యం ఉన్న సదుపాయాలు తొలగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రీమియం రూ.1300 స్థానంలో రూ.10 వేలు చెల్లించాలని, అదేవిధంగా రూ.8 వేలు ఉన్న ఓపీ రీయింబర్స్‌మెంట్‌ను రూ.4 వేలకు కుదించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వెంటనే యాజమాన్యం ఆ ప్రతిపాదన విరమించుకుని పాత పద్ధతి కొనసాగించాలని కోరారు. అనంతరం హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీకి వినతిపత్రం అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, దాడి శివరామ్, ఎం.ఎ.మాధవరావు, కోరాడ అప్పారావు, డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, దీనబంధు, పరమట సత్యనారాయణ, పైడిరాజు, డి.వి.రమణారెడ్డి, సన్యాసిరావు, బాలభాస్కరరావు, బి.వెంకటరావు, పరంధామయ్య, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు వినతి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం గాంధీకి సమస్యలు వివరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కోరారు. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీని కలిసి, సమస్యలపై చర్చించారు. పదవీ కాలం పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా ఎన్నికల కోసం యాజమాన్యానికి లెటర్ ఇవ్వకుండా, అసోసియేషన్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయకుండా ప్రస్తుత కార్యవర్గ సభ్యులు కావాలనే కాలయాపన చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రిటైర్ అయిన సభ్యులకు ఇవ్వాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఫండ్ (ఆర్‌బీఎఫ్) సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. గత 22 నెలలుగా జనరల్ బాడీ పట్టలేదని, జమా ఖర్చులు చెప్పడం లేదన్నారు. దీనిపై సీజీఎం స్పందిస్తూ ఎన్నికలు నిర్వహించడానికి త్వరలో యాజమాన్యం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారని నాయకులు చెప్పారు. కార్యక్రమంలో పి.సోమునాయుడు, బి.ఎ.స్వామి, డి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి యలమంచిలికి చెందిన తొగరు అక్కయ్య రూ.లక్ష 116 విరాళం ఇచ్చారు. దాతకు స్టోర్స్ సీనియర్ అసిస్టెంట్ పి.సూరిబాబు బాండ్ అందించారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం ఉద్యోగి హరి పాల్గొన్నారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అధికారులు అందించారు.

34 మంది విద్యార్థులకు కంటి అద్దాల అందజేత



కంటి అద్దాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం కాంతం, ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం : జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 34 మంది విద్యార్థులకు హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం గురువారం కంటి అద్దాలు అందజేశారు. అంధత్వ నివారణలో భాగంగా గాజువాక పీహెచ్‌సీ డాక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇటీవల కంటి పరీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో 34 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని నిర్ధారించి అందజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, ఉపాధ్యాయుడు కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్, ఏఎన్‌ఎం సీహెచ్.మహాలక్ష్మి పాల్గొన్నారు.

లీఫార్మా ఇంటర్వ్యూలో 13 మంది ఎంపిక



నిర్వాహకులతో ఎంపికైన అభ్యర్థులు

గాజువాక : లీఫార్మా కంపెనీలో ఉద్యోగ నియామకాలకు స్థానిక టీఎస్టార్, టీబీకే డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 13 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. 30 మంది అభ్యర్థులకు మూడు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తదితరులు అభినందించారు.

అదుపు తప్పితే.. అంతే!



పెదగంట్యాడ - గంగవరం పోర్టు వంతెన వద్ద ప్రమాదకరంగా మారిన కాలువ



రక్షణ గోడ లేక అంచుల వద్ద ప్రమాదకరంగా ఉన్న కాలువ

పెదగంట్యాడ : అది అదానీ గంగవరం పోర్టు వంతెన ప్రాంతం.. ఆ ప్రాంతంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.. అటు గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్‌కు వేలాది మంది విధుల నిమిత్తం వెళ్లి వస్తుంటారు. ఇటు గంగవరం గ్రామం నుంచి గాజువాకకు, ఆటోనగర్‌లోని పరిశ్రమల్లో పని చేస్తున్న వారు రాకపోకలు సాగించేందుకు ఇదే ప్రధాన రహదారి. అయితే ఈ రహదారి ఇప్పుడు మృత్యుకుహరంగా మారింది. రోడ్డు పక్కన ఉన్న కాలువలకు రక్షణ చర్యలు చేపట్టపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాలు అదుపు తప్పి ఆ కాలువల్లోకి దూసుకెళ్లిపోతున్నాయి. దీంతో ఈ రోడ్డులో ప్రయాణమంటే వాహనచోదకులు హడలి పోతున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ ప్రాంతంలో వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రమాదాలు చోటుచేసుకోవడంతోపాటు ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.